గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలకు నిప్పు

- ధ్వంసమైన ఫర్నిచర్స్ బుక్స్

విశాలాంధ్ర-వీరబల్లి: మండలంలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీలో ఉండే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలకు పెట్రోల్ పోసి నిప్పు అంటించారు జరిగిన సంఘటనలు ఆ పాఠశాలలో వాచ్మెన్ గా పనిచేస్తున్న వ్యక్తి సాయంత్రం ఏడు గంటలకు డ్యూటీకి రావడంతో అప్పటికే బుక్స్ టేబుల్స్ కాలిపోవడం జరిగిందన్నారు వెంటనే స్థానిక ప్రధాన ఉపాధ్యాయునికి పోలీస్ వారికి తెలియజేశారు పాఠశాలలో ఉండే ఫర్నిచర్స్ బుక్స్ పూర్తిగా కాలిపోవడంతో పాఠశాల పూర్తిగా కాలిపోయింది ఈ పాఠశాల పెంకులు ఉండే పురాతన పాఠశాల కావడంతో పూర్తిగా కాలిపోయింది అన్నారు మంగళవారం రూరల్ సీఐ వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని పాఠశాల ఉపాధ్యాయులను, గ్రామస్తులను విచారణ చేయబడుతున్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

బుధవారం, 10 సెప్టెంబర్ 2025 | 8 పేజీలు

బతకాలి.. గెలవాలి

క్షణికావేశం ఎంతపనైనా చేయిస్తుంది. శారీరక, మానసిక సమసలతో సతమతమయ్యేవారిలో చాలా మందికి ఒకానొక దశలో ఇక జీవితంపైనే విరక్తి కల్గి ఎందుకీ బతుకనిపిస్తుంది. ఈ నెగెటివిటీనే ఆత్మహత్య చేసుకోవడానికి ఆలోచనలను రేకెత్తిస్తుంది. అయితే ప్రతి సమస్యకు చావు పరిష్కారం కాదు, బతికి జీవితాన్ని గెలవాలి. అంతేగాని ఆత్మహత్య పరిష్కారం కాదు.

- విశాలాంధ్ర-పులివెందుల

కలిసిరాని కాలంలో ఎంతో మంది అవస్థలను ఎదుర్కొంటున్నారు. అన్నదాతలు, విద్యార్థులు, కార్మికులు క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కానీ బలవన్మరణం సమస్యకు పరిష్కారం కాదు. అలాగే బలహీనపడినప్పుడు సాయం కోరడంలో బలహీనతకారాదు. అందుకే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ ఆత్మహత్యల నిరోధక సంఘం కలిసి ప్రారంభించాయి. ఉద్దేశ్యం మానవ జీవిత విలువను గుర్తుచేయడం, ఆత్మహత్యలను అడ్డుకునే మార్గాలను సమాజానికి చాటడం.

ఆందోళన కలిగించే గణాంకాలు

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 40సెకన్లకు ఒకరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా యువతలో ఆత్మహత్యలు అధికం కావడం ఆందోళన కలిగిస్తోంది. నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, పరీక్షల ఒత్తిడి, మానసిక దౌర్భల్యం వంటి కారణాలు దీని వెనుక ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

అవగాహన అవసరం

ఆత్మహత్య చేసుకోవాలనుకునే వ్యక్తి ముందుగా మానసిక ఆందోళనలో ఉంటాడు. చిన్న విషయాలకే ఆవేశపడటం, ఒంటరితనం కోరుకోవడం, నిస్సహాయత భావాలు వ్యక్తం చేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అటువంటి సందర్భాల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు సకాలంలో ఆ వ్యక్తికి మానసిక బలం నింపితే ఆత్మహత్యను నివారించడం సాధ్యం అవుతుంది.

- సమస్యకు చావు పరిష్కారం కాదు..
- మానసిక ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి
- బలహీనపడినప్పుడు సాయం కోరడంలో బలహీనతకారాదు
- నేడు ఆత్మహత్యల నివారణ దినోత్సవం



సమాజిక బాధ్యత

సమాజం మొత్తం కలిసి ఆత్మహత్యల సమస్యను ఎదుర్కోవాలి. మానసిక ఆరోగ్యంపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించడం, కౌన్సెలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచడం, సాయపడే హెల్ప్‌లైన్ నంబర్లను ప్రతి ఒక్కరికి తెలియజేయడం చాలా అవసరం.

ఆత్మహత్యల నివారణకు కార్యకలాపాలు

- ఆత్మహత్యల నివారణ కోసం అంతర్జాతీయ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్యలతో కలిసి ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.
- 2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ 1999లో ప్రపంచ ఆత్మహత్యల నివారణకు చూపిన చొరవ దాని అమలుకొరకు చేసిన ప్రణాళికలకు సంబంధించి ప్రస్తావించబడింది.
- ఆత్మహత్యకు ముందు ప్రవర్తనల గురించి అవగాహన పెంచడానికి, వాటిని ఎలా సమర్థవంతంగా నిరోధించాలో తెలియజేయడానికి ప్రపంచ, ప్రాంతీయ, జాతీయ బహుళ-రంగ కార్యకలాపాల సంస్థ ఏర్పాటు చేయాలని సూచించింది.
- ఆ సంస్థ ద్వారా జాతీయ విధానాలు, ఆత్మహత్యల నివారణ ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి, అంచనా వేయడానికి దేశాల సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది.

మనోధైర్యమే ముఖ్యం

ఆత్మహత్య ఎప్పుడూ సమస్యకు పరిష్కారం కాదు. మనసు బలహీనపడినప్పుడు సహాయం కోరడం బలహీనత కాదు అది ధైర్యం. "జీవితం విలువైనది, ఒక్క క్షణపు ఆవేశం శాశ్వత చీకటి తెచ్చిపెట్టవచ్చు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయడం మనందరి బాధ్యత.

మంచమేసి.. మొండికేసి!

- తహసీల్దార్ ఆఫీసు ఎదుట వృద్ధుడి నిరసన
- న్యాయం చేయాలంటూ వేడుకోలు

విశాలాంధ్ర-సంబేపల్లె: ఊళ్లో తాను నిర్మించుకున్న రేకుల షెడ్డును అదే గ్రామానికి చెందిన కొందరు దౌర్జన్యంగా కూల్చేశారని, అధికారులు చెప్పినా పట్టించుకోలేదని ఓ బాధిత వృద్ధుడు నిరసనకు దిగాడు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట

..మిగతా 2లో

సహజ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-ములకలచెరువు: సహజ ఎరువులు, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సోంపల్లిలో నానో ఎరువులు, జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరితో పాటు మదనపల్లి సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రజాప్రతినిధు లు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండా సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

..మిగతా 2లో

హాస్టల్లో మంత్రి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల: మండలంలోని పొట్లదుర్తి బాలుర సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని మంగళవారం మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పరిశీలించారు. భవనానికి చేపట్టిన మరమ్మతు పనుల పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహారం, వసతి, త్రాగునీరు, చదువు, ఆరోగ్యం తదితర వాటిపై విద్యార్థులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి చేరాలని ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వసతి గృహం నిర్వాహకులు నరసారెడ్డి, ఏఎస్‌డబ్ల్యుఓ సరస్వతి, ట్యూటర్ మహేంద్ర బాబు ఉన్నారు.

నిర్ధారణ పేరుతో దోపిడీ

కొందరికి జలుబు.. మరికొం దరికి జ్వరం.. ఇంకొందరికి ఒళ్ళు నొప్పులు.. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండడంతో చిన్నా చితక తేడా లేకుం డా అన్ని ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదునుగా కొందరు ప్రథమ చికిత్స కేం ద్రాల నిర్వహకులు వైద్యాన్ని వ్యాపారంగా మా ర్చారు. ఒకపక్క రోగం పీడిస్తుంటే.. మరోపక్క వ్యాధి నిర్ధారణ పేరుతో కొందరు నిర్వాహకు లు దోచేస్తున్నారు. వీరికి ల్యాబుల నిర్వాహకు లు తోడవుతున్నారన్న ఆరోపణలు రోగుల నుండి వినిపిస్తున్నాయి.

- విశాలాంధ్ర-ఎర్రగుంట్ల

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- కుదేలవుతున్న సామాన్యులు
- జేబులు నింపుకుంటున్న నిర్వాహకులు

వైద్య పరీక్షలు నిర్వహించిన పిదప వ్యాధి నిర్ధారణ పేరుతో ల్యాబులకు పంపుతున్నారు. ఇందుకు సంబంధించి ల్యాబుల నిర్వాహకుల వద్ద వైద్యులు 50శాతం కమీషన్ స్వీకరిస్తున్నట్లు సమాచారం.. ప్రజ లు దగ్గరలోని పిహెచ్‌సి, ప్రాంతీయ ఆసుపత్రులను ఆశ్రయించాల ని, అన్ని సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

..మిగతా 2లో

క్లుప్తంగా

రైతులకు యూరియా సరఫరా చేయాలి

విశాలాంధ్ర-ములకలచెరువు: రైతులకు డీఏపీ యూరియా సరఫరా చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రైతుభరోసా కేంద్రం వద్ద నిరసన తెలిపారు. రైతు సంఘం నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డప్ప, గంగులప్పా, సుబ్బన్న, జయకర్, పాపులమ్మ, శంకరమ్మ, రామచంద్ర, నరసింహులు, ఉత్తన్న పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల: ఏపీఎస్పీఈ జెఏసి ప్రాంతీయ నాయకులు మంగళవారం ఆర్టీపిపి సిఈ వాసుదేవరావుకు వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం పట్ల నిర్లక్ష్యం తగదని గుర్తు చేశారు. ఇప్పటికే పాలు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి న్యాయ సమ్మతమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ ప్రజా చైతన్య సేవా సంఘం రాయచోటి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ లక్కిరెడ్డిపల్లి నందు హెచ్.ఐ.వి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగముగా హెచ్.ఐ.వి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబంధం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఏ ఆర్ టి మందులు, ఏపీ ఎస్ఏ సిఐఎస్ యాప్ ,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ అలానే చెడు వ్యసనాలకు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలు చెబుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి. రమేష్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నివారణ పట్ల ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. టీచర్స్, ప్రసాద్ యాదవ్, రామ్మోహన్, షారద్దీన్, రాజశేఖర్, పి సి యస్ యస్ ప్రాజెక్ట్ మేనేజర్ టి. స్వాతి ఓ ఆర్ డబ్ల్యూ విజయలక్ష్మి,పి ఈ సంపూర్ణ తదితరులుపాల్గొన్నారు.

నిర్ధారణ పేరుతో దోపిడీ

మొదటి పేజీ తరువాయి

ప్రైవేట్ ఆసుపత్రులకు నిర్దేశిత సూచనలు ఇస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ల్యాబుల తనిఖీ.. స్థానిక పురపాలక పరిధిలోని వ్యాధి నిర్ధారిత ల్యాబ్‌లను మంగళవారం ప్రభుత్వ వైద్య బృందం తనిఖీ చేసింది. ఎన్ఐఎస్ఎస్ఐ, భారత్ ల్యాబ్‌లను వీరు తనిఖీ చేశారు. ఈ సందర్భముగా వైద్య బృందం ల్యాబుల నిర్వాహకుల విద్యార్హత పత్రాలను పరిశీలించారు. వ్యాధి నిర్ధారణ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రోగుల నుండి అధిక రుసుము వసూలు చేస్తే ల్యాబులను మూసివేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు శ్రీనాథ్ రెడ్డి, సూపర్వైజర్ ఓబులేసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆదేశానుసారం ల్యాబులను తనిఖీ చేయడం జరిగిందన్నారు.

హోమియోపతి.. అల్లోపతి ఎలా!

జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఓ పురపాలికలో హోమియోపతి వైద్య విద్యను అభ్యసించిన ఒక్కరిద్ద రు ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహిస్తూ రోగులకు అల్లోపతి మందులను రాస్తున్న వైనం విమర్శలకు దారి తీస్తోంది. ఈ అంశంపై కొందరు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

మంచమేసి.. మొండికేసి!

మొదటి పేజీ తరువాయి

వినూత్న రీతిలో మంచం వేసి కూర్చుని అధికారులకు తన నిరసనను తెలయజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మూడు నెలలప్పుడు గ్రామంలో తన రేకుల షెడ్డును గ్రామానికి చెందిన కొందరు అన్యాయంగా కూల్చేశారని వారిని ఎదుర్కొనలేక కలెక్టర్, ఎస్పీ, తహసీల్దార్‌లకు విన్నవించానని చెప్పారు. మూడు నెలలుగా తనకు ఎలాంటి స్పందన లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి మంచం తీసుకొచ్చి ఇక్కడే ఉండిపోవాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి వచ్చి సమస్యను పరిష్కరించేంత వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చున్నాడు. దీంతో వృద్ధుడి వద్దకు వచ్చిన తహసీల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డి కలగజేసుకుని సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇవ్వడంతో వృద్ధుడు నిరసన విరమించాడు.

సహజ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి: కలెక్టర్

మొదటి పేజీ తరువాయి

ఇప్పటి వరకు రైతులు అవసరానికి మించి 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయడం జరిగిందని, అదనంగా 1000 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నదని, అవసరమైతే మరిన్ని టన్నులు యూరియాను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా పేర్కొన్నారు. యూరియా అధికంగా ఉపయోగించడం వల్ల భూమి సారాన్ని తగ్గించి భవిష్యత్తు తరాలకు నష్టాన్ని కలుగజేస్తుందని హెచ్చరించారు. ఎవరైనా అధిక రేటుకు కొనుగోలు చేసినట్లు సాక్ష్యాలు ఉంటే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదులకు 08561293006 నంబర్‌ను అందుబాటులో ఉంచారు. రైతుల పేర్లు గోప్యంగా ఉంచుతామని, దుకాణాల లైసెన్సులు రద్దు చేసే వరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో హరి నారాయణ, జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖ, మండల వ్యవసాయ అధికారులు, ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విభజన గ్రామాలను సరిదిద్దాలి

సోంపల్లి గ్రామానికి విచ్చేసిన కలెక్టర్‌కి విభజన గ్రామాలను సరిదిద్దాలని సిపిఐ మండల కార్యదర్శి అంజనప్ప, సహాయ కార్యదర్శి నిజాంద్దీన్‌లు వినతి పత్రం అందజేశారు. సానుకూలతతో విన్న కలెక్టర్ ప్రజలకు ఇబ్బంది లేకుండా చేద్దామని హామీ ఇచ్చారు.

రామచంద్ర నాయుడుని పరామర్శించిన మాజీ ఎంపీపీ

విశాలాంధ్ర-వీరబల్లి: మండలంలోని గుర్రప్ప గారిపల్లె పంచాయతీ చిట్‌రాజుగారిపల్లెలో రామచంద్ర నాయుడు అనారోగ్యముతో చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకున్న సందర్భంగా వీరబల్లి మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి రామచంద్ర నాయుడుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని భోజన సమయపాలన చేసి ఆరోగ్యంగా ఉండాలని 30 నిమిషాల పాటు వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిదని ఆయనకు తెలిపారు అనంతరం ఆయన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు ఆయనతోపాటు ఎంపీపీ రాజేంద్ర నాద రెడ్డి శ్రీరాముల్ రెడ్డి తాటికుంటపల్లి సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి మదనమోహన్ ఆరం రెడ్డి సత్య నారాయణ రెడ్డి. తా రత్నేశ్వర్ రెడ్డి. చక్రధర్ నాయుడు మదన్మోహన్ నాయుడు జయచంద్ర నాయుడు పలు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులను తక్షణం అరెస్టు చేసి ప్రభుత్వ భూములను కాపాడాలి: సిపిఐ

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: నియోజకవర్గ పుల్లంపేట మండలంలోని కేతరాజుపల్లి రెవిన్యూ 206సర్వేనెంబర్‌లోని ప్రభుత్వ భూమిని రాత్రి పూట జెసిబి పెద్ద పెద్ద మిషన్లు పెట్టి అక్రమంగా చదును చేస్తున్న భూ కబ్జాదారులను తక్షణం అరెస్టు చేసి,జెసిబి పెద్ద మిషన్లను సీజ్ చేసి భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంచాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, పుల్లంపేట సిపిఐ మండల కార్యదర్శి రాజబోయిన సెల్వం కుమార్ డిమాండ్ చేశారు. కబ్జాలకు గురైన భూములను మంగళవారం సిపిఐ బృందం స్థానికులతో కలసి క్షేత్రస్థాయిలో సమగ్రంగా కబ్జా భూమిని పరిశీలించి అనంతరం పుల్లంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద సెల్వం కుమార్ అధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను రాత్రి పూట కబ్జాదారులు జెసిబి పెద్ద పెద్ద మిషన్లు పెట్టి చదును చేస్తుంటే రెవిన్యూ అధికారులు,విఆర్ఓ లు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.భూ కబ్జాదారులకు సహకరిస్తున్న రెవిన్యూ అధికారులను విధుల నుండి సస్పెండ్ చేసి న్యాయ విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేతరాజుపల్లి, ఉడుంవారి పల్లి, ఎస్సీ కాలనీలలో ఒక్కొక్క కుటుంబంలో రెండు, మూడు ఫ్యామిలీలు జీవనం సాగిస్తున్నారన్నారు. అటువంటి అర్హులైన పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయని పక్షంలో పేదలకు అండగా నిలబడి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రెవిన్యూ అధికారులను హెచ్చరించారు. నిరుపేదలకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామన్నారు. కేతరాజుపల్లి, ఉడుంవారిపల్లి, ఎస్సీ కాలనీలకు చెందిన గ్రామస్తులు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. తహశీల్దారు పుల్లారెడ్డి కి వినతిపత్రం అందజేసి ధర్నా కార్యక్రమాన్ని విరమించారు.

టపాకుల నిప్పు పడి ఆహుతైన టీ హోటల్

విశాలాంధ్ర-వీరబల్లి: మండల కేంద్రంలో బస్టాండ్ నందు ఉన్న ముస్లిం సోదరుడైన కరిముల్లా బోధ కొట్టం నిర్మించుకొని టీ అమ్ముకొని జీవనం సాగించేవారు. మంగళవారం రాజంపేట నియోజకవర్గం తెలుగు దేశం ఇన్చార్జి పదవి చేపట్టిన జగన్మోహన్ రాజు మొట్టమొదటిసారిగా మండలానికి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ నందు తెలుగు తమ్ముళ్లు టపాసులు కాల్చడంతో నిప్పులు పోయి బోధ కొట్టంపై పడి పూర్తిగా కాలిపోయింది. దీంతో ఆ ముస్లిం కుటుంబము దిక్కు తోచని పరిస్థితిలో నిరుత్సాహంతో ఉండిపోయారు. ముస్లిం సోదరుడు కరీముల్లా ఇటీవలనే వేలు ఖర్చు చేసి బోధ కొట్టమును కప్పుకోవడం జరిగింది.ఇలా మండలంలో పదవి పొందిన తొలిసారిగా అడుగుపెట్టడంతో అనార్థం జరిగిందని ఇది మంచిది కాదని పలువురు నుండి విమర్శలు చేస్తున్నారు. పేదవాని ముస్లిం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ బహిరంగ సభను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: ఈనెల 10న జరగనున్న సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభకు గౌరవ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళుతున్నారని గాజుల ఖాదర భాష పేర్కొన్నారు. మంగళవారం నాడు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ... అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి అన్ని సంక్షేమ పథకాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందజేస్తూ ముందుకు వెళుతున్న నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో జరుగుతున్న సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సభకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని సీఎం సభకు వచ్చే ప్రతి ఒక్కరికి కూడా భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగిందని తాగు నీటి బాటిల్స్ వాటర్ ప్యాకెట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఈ 14నెలల సుపరిపాలనలో విజయవంతంగా అమలు చేసిన సందర్భంగా పదవ తేదీన అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ భారీ బహిరంగ సభ కు ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివస్తున్నారని ప్రజలందరూ రాష్ట్రంలో ఎంతో హాయిగా ఉన్నారని చంద్రబాబు నాయుడు గారి తోనే రాష్ట్రము అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ప్రజలందరూ నమ్ముతున్నారని తెలిపారు బీసీలు ఎస్సీలు ఎస్టీలు మైనార్టీలు ప్రతి ఒక్కరికి కూడా అనేక రకాలుగా ప్రోత్సహిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారని తెలిపారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగార్జున రోఫా శివ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని రేకలకుంట పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ ఎస్ ఏ సిఎస్ మరియు దిశ కడప జిల్లా వారు ఆదేశానుసారం చిల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారి ద్వారా ఆధ్వర్యంలో 104సిబ్బందితో కలిసి పాఠశాల విద్యార్థులకు ఐఈసి హెచ్ఐవి ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు ర్యాలీ చేపట్టారు. పాఠశాల హెచ్ఎం కరిముల్లా ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, ఓబులేష్ ఎంఎ, భాస్కర్ ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల కన్నీరు మున్నీరు..

- అన్నదాత పోరులో వైసిపి నాయకులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం 15నెలల పాలనలో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని, పండించిన ఏ ఒక్క పంటకు కనీసం మద్దతు ధర, యూరియా దొరకక విలవిల్లాడుతున్నారని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ భాష విమర్శించారు.మంగ ళవారం అన్నదాత పోరులో భాగంగా కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. తొలుత వైసీపీ కార్యాలయం నుంచిర్యాలీగా ఆర్డీవోకార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వైసీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందించిన అనంతరం రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్బి అంజద్ బాషా మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రైతుల సమస్యలను గాలిలో వదిలే శారని ఆయన ఘాటుగా విమర్శించారు. యూరియా దొరకక రైతులు అల్లాడుతున్నారన్నారు. పండించిన పంటలకు కూడా మద్దతు ధర లేక పోవడంతో అప్పుల పాలై, అప్పులకు వడ్డీలు కూడా కట్టుకోలేక పోతున్నారన్నారు. ఉల్లి పంటకు కూడా కనీసం మద్దతు ధర లభించలేదన్నారు. క్వింటాల్ ఉల్లిధర 1200 నుంచి 3వేలకు కనీసం మద్దతు ధరను పెంచాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా దొరకక బ్లాక్ మార్కెట్ లో బస్తా రూ.600కు కొనుగోలు చేసి నష్టపోతున్నారన్నారు. ధరల స్థిరీకరణ నిధి పేరుతో మోసంచేశారని, పంటనష్ట పరిహారం చెల్లించకుండా ఎగనామం పెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జయ చంద్రరెడ్డి, యానాదయ్య, షఫీ, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, టిబి.వెంకటసుబ్బమ్మ, దీప్తి రెడ్డి, కృష్ణవేణి రెడ్డి మల్లేశ్వరి వైసీపీ నాయకులు, నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

న్యూస్ రీల్

పీపీపీ విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-ములకలచెరువు: ప్రభుత్వం వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కార్యదర్శి తరుణ్ పీపీపీ విధానం అమలు చేస్తే వందలాది మంది ప్రతిభగల విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమౌతుందని పేర్కొన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

టిబి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర-కలికిరి: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వెంటనే వైద్య సేవలు పొందాలని వైద్యులు సూచించారు. అదే విధంగా టిబి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మంగళవారం కలికిరి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యులు టిబి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమ ంలో సిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ కావ్య గంధ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ ఆఫ్ బిజినెస్ టెక్నాలజీపై గెస్ట్ లెక్చర్

విశాలాంధ్ర-మదనపల్లె: మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఎంబిఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఎంబిఏ విభాగం వారు "ది ఫ్యూచర్ ఆఫ్ బిజినెస్ అండ్ టెక్నాలజీ" అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా తిరుపతిలోని డేటా కోట్స్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈవో హర్షద్ బాషా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మేనేజ్‌మెంట్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వ్యాపార ధోరణులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. విభాగాధిపతి డాక్టర్ భానుశ్రీ రెడ్డి, డాక్టర్ గీతదేవి, కోఆర్డినేటర్ జ్ఞానప్రసూన, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గర్భవతులకు పౌష్టికాహారం

విశాలాంధ్ర-నందలూరు: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుండి చికిత్స నిమిత్తం విచ్చేసిన గర్భవతులకు రాయల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షులు గంగనపల్లి శ్రీనివాసులు మంగళవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముందుగా గర్భిణీలకు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ మస్తానమ్మ వైద్య పరీక్షలు చేసి,తగు జాగ్రత్త లు తెలియజేశారు. సభ్యులు గంధం గంగాధర్, పునగాని. రామయాదవ్, కలిశెట్టి భరత్, చంద్ర, లక్ష్మీకర్, శివ ఇతరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యత

విశాలాంధ్ర-వేముల: డ్వాక్రా మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వేముల వెలుగు ఏపిఎం ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలోని స్త్రీ భవన్‌లో డ్వాక్రా మహిళల మెగా ఋణ మేళా బ్యాంకు లింకేజీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం డ్వాక్రా మహిళల జీవనోపాదుల మెరుగుదలకు 2కోట్ల 50లక్షల రుణాలు మంజూర చేయడం హర్షనీయం అన్నారు. ఋణాలు పొందిన డ్వాక్రా మహిళలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త కార్యక్రమాన్ని విజయవంతం చేసేటందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు జ్యోతి జైపాల్ కోన హరికృష్ణ గంగరాజు నాగేశ్వరి మండల సమాఖ్య అకౌంటెంట్ చిన్నరెడ్డి, సమాఖ్య అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కడిగిన ముత్యంలా చంద్రబాబు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: చంద్రబాబును గత వైసిపి ప్రభుత్వం అక్రమ అరెస్టు చేసి ఇప్పటికి రెండేళ్ళు అయిందని అయినప్పటికీ అన్ని రోజులు జైల్లో పెట్టిన కడిగిన ముత్యంల బయటికి వచ్చి ప్రజల ఆదరణ పొందిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలం ఖాన్ పల్లె లక్ష్మీ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 9న మా నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ను అక్రమంగా అరెస్టు చేసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాక్షసానందం పొందాడన్నారు. అరెస్టు చేసి 53 రోజులు జైల్లో ఉంచినా ఒక్క ఆరోపణను రుజువు చేయలేకపోయారన్నారు. చంద్రబాబు ఎప్పటికీ ప్రజల మనిషినని ప్రజలు ఆయన వెంట ఉన్నంతవరకు ఆయనకు ఏమీ కాదని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా ముందుకెళుతున్నారని ఆయనకు ఇక ఎదురులేదని ఆశాభావం వ్యక్తం చేశారు.

సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచాలి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: రైతులకు నానో, జీవన ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మంగళవారం మద్దిరేవుల గ్రామంలోని ఈడిగపల్లిలోని సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ క్రాంతికుమార్ మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భూములు సారాన్ని కోల్పోతున్నాయని, అందుకే రైతులు సేంద్రీయ, నానో, జీవన ఎరువులను వినియోగించాలని సూచించారు. మండలంలో యూరియా కొరత లేదు అని అన్నారు. యూరియా ఎకరానికి 1.5 మూట మాత్రమే వాడుకోవాలి అని తెలియచేసారు. పంట పెట్టిన ప్రతి రైతుకు యూరియా కొరత లేకుండా వుంది అని తెలియచేసారు. సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, హార్టికల్చర్ అధికారి మల్లికార్జున, టిడిపి నాయకులు బాబుల్ రెడ్డి, రాధాకృష్ణ, ఆంజనేయులు, రవికుమార్ రెడ్డి, మల్లి, చంద్రయ్య రైతులు పాల్గొన్నారు.

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-రాజంపేట: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జరిగే వికలాంగుల సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ పి.వి. నాగేశ్వర్ రాజు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8 వ తేదీన జరగవలసిన సదరం క్యాంపు ను డాక్టర్ మాధవరెడ్డికి పదోన్నతి రావడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి బదిలీ కావడం జరిగిందన్నారు. ఆన్లైన్ ద్వారా స్లాట్స్ బుక్ చేసుకున్న వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారానికి ఒకసారి మదనపల్లి నుండి రాజంపేటకు వస్తున్న ఆర్థోపెడిక్ వైద్యుడు ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఉన్నటువంటి కంటి వైద్య నిపుణరాలు మెటర్నటీ సెలవులో ఉందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుండి హాస్పిటల్‌కి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. రోగులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సోమవారం సోషల్ మీడియాలో కొంతమంది ప్రభుత్వ ఆసుపత్రి పై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు.

ఉస్మాన్‌బాషాపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి: బిజెపి

విశాలాంధ్ర-పులివెందుల: సోషల్ మీడియాలో హిందూ దేవతలపై అసభ్యకరంగా మాట్లాడిన ఉస్మాన్ బాషాపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్ రెడ్డి డిమాండ్ చేశారు. షేక్ ఉస్మాన్ భాష సోషల్ మీడియాలో హిందూ దేవతలను కించపరిచేలా మాట్లాడిన వీడియోలో ఆధారంగా హిందూ జేఏసీ నాయకులు ఉస్మాన్ భాషను పట్టుకున్నారు. వారి నుండి పోలీసులు షేక్ ఉస్మాన్ భాష ను పూలంగుల సర్కిల్ దగ్గర అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. అనంతరం హిందూ జేఏసీ నాయకులు అర్బన్ స్టేషన్ సందు ఉస్మాన్ బాషాపై చర్యలు తీసుకోవాలని ధర్నాకు దిగారు..సిబ్బంది స్పందించి డిఎస్పీ దగ్గరికి వెళ్లాలని ఆ విషయంపై విచారణ చేస్తారని తెలపగా అక్కడికి వెళ్లి డిఎస్పీ మురళి నాయక్ కు ఉస్మాన్ భాష చేసిన వివాదాస్పద వాక్యాలను వీడియోల రూపంలో డిఎస్పీ అందజేశారు. అనంతరం శశిభూషణ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ షేక్ ఉస్మాన్ భాష హిందూ దేవుళ్ళ పై అసభ్యలతో సోషల్ మీడియాలో వీడియో కాల్స్ చేశారన్నారు. ఆ వీడియో కాల్ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ మా వద్దకు వచ్చిందన్నారు. హిందూ జేఏసీ సభ్యులందరూ ఏకమై ఉస్మాన్‌ను పట్టుకున్నామన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

- అట్లూరు ఎస్సై రామకృష్ణ

విశాలాంధ్ర-అట్లూరు: అట్లూరు మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలో అనధికారంగా మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపులు నిర్వహించినా, బెల్ట్ షాపులను ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అట్లూరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ బెల్టు షాపులను ప్రోత్సహించినా, నిర్వహించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అట్లూరు మండల పరిధిలో గల మద్యం షాపు యజమానులను హెచ్చరించారు. ఇటీవల అక్రమ షాపులపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అట్లూరు స్టేషన్ పరిధిలో నాటుసారా, అనధికార మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులు, గంజాయి అమ్మకాల సూచి 9121100629 అను నెంబర్కు సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు తెలియజేశారు. గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అట్లూరు ఎస్సై రామకృష్ణ సూచించారు. జిల్లా ఎస్పీ ఈజీ .అశోక్ కుమార్ ఆలోచన మేరకు ఆయన అట్లూరు జడ్పీ హైస్కూల్లో మంగళవారం పోలీస్ పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలు, సైబర్ నేరాలు, వ్యసనాల వల్ల కలిగె నష్టాలపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డును కమ్మేసిన కంప చెట్లు

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ నుండి మైదుకూరు హైవే రోడ్డు లోని చెన్నంపల్లి క్రాస్ నుండి చెముదూరు పెద్ద కేశం పల్లె శంకరాపురం మీదుగా కడప రోడ్డులో కలిసే రోడ్డు నిత్యం రద్దీతో వాహనాలు తిరుగుతుంటాయి స్కూల్ వ్యానులు ఆటోలు లింకు రోడ్డుకు పోవు లారీలు ఇతర ప్రైవేటు వాహనములు కంపచెట్లతో మూసుకు పోయిన ఆ రోడ్డుపై పోవాలంటే వాహన దారులు ఇబ్బందుల గురవుతున్నారు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక క్రాస్ చేయడానికి ఇబ్బంది పడుతూ నిత్యం ప్రమాదాలు గురవుతున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజల భయభ్రాంతులకు గురవుతున్నారు అధికారులు స్పందించి ఇప్పటికైనా కంప చెట్లను తొలగించాలని ఆ ప్రాంతప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారం.. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : తొట్లపల్లెలో త్రాగు నీరు పైప్ లైన్‌లో లీకేజీ ఏర్పడి నీరు వృధాగా పోతున్న విషయం ఎమ్మెల్యే పుట్టా దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నీటి శాఖ, మండల అధికారులు ఆర్డబ్ల్యూఎస్ డిఈ, శివ రుద్ర గౌడ్, ఈఏ వెంకటేష్ అక్కడికి చేరుకొని నీటి సమస్యను పరిష్కరించే విధంగా వారు కృషిచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించమని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం బిమఠం అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు వెంటనే చేపట్టి రేపటి లోపు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వటం జరిగింది. తమ సమస్య తెలుసుకొని వెంటనే స్పంచిందించిన ఎమ్మెల్యే పుట్టాకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్‌గా ఖాజారంతు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్‌గా సాధనకారి ఖాజారంతు నియమితులయ్యారు. ఆయన స్వగృహంలో ఎంపీటీసీ కలవకూరి రమణ నాయుడు, శ్రీకాంత్‌లు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పాపయ్య, కరీముల్లా, కేశవ, నాయబ్, నాగేంద్ర, మురళి, శివ, గణేష్ పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నిరక్ష్యరాశ్యత నిర్మూలనకు కృషి

విశాలాంధ్ర - వీరబల్లి : మండలంలోని నిరక్షరాస్య నిర్మూలనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో జవహర్ బాబు అన్నారు.అక్షర ఆంధ్రాలో భాగంగా ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని 220 అక్షర కేంద్రాలలో వాలంటీరీ టీచర్లతో ఉత్తమ పద్ధతుల్లో బోధన చేయడం జరుగుతుందన్నారు.

యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ పట్టణంలో వైసీపి రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు బద్వేల్ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా , వైఎస్ఆర్సిపి నాయకులు ఎరువుల బ్లాక్ మార్కెట్ పై రైతు పోరు బాట నిర్వహించారు. వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అందరూ ర్యాలీగా వెళ్లి బద్వేల్ ఆర్డీఓని కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని, రైతులకు యూరియా ఎరువు ఎక్కువ రేట్లకు అమ్ముతూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారని, బ్రహ్మ సాగర్ నుంచి బద్వేల్ నియోజకవర్గం లోని అన్ని చెరువులకు నీటిని నిలువ ఉంచి రైతులకు మేలు చేయాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో బద్వేల్ నియోజవర్గంలోని అన్ని చెవులకు జూన్ మాసంలోనే నీటిని నిలువ ఉంచి రైతులకు ఆదుకున్నామని ఇప్పుడు పరిస్థితి ఘోరంగా ఉందని అందులోనూ ఉన్న నీటితో పంటలు పండించుకున్న ఎరువులు ఎక్కువ ధరకు అమ్ముకుంటూ రైతులకు అన్యాయం చేస్తున్నారు అని వైసీపి నేత

గోవింద్ రెడ్డి నాయకత్వంలో ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపి కౌన్సిలర్లు జడ్పీటీసీలు ఎంపీటీసీలు సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోండి..రక్తహీనతను నివారించండి

విశాలాంధ్ర - బద్వేలు : మండల పరిధిలోని తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ ప్రోగ్రాం నందు డాక్టర్ జి.రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ కాన్పు సమయంలోను ఏదైనా చిన్నచిన్న రుగ్మతలు ఉన్నా 108 వాహనము ఉపయోగించుకొని ఆస్పత్రులకు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు, ఈ కార్యక్రమంలో పోషకాహారం గురించి ఆసుపత్రుల్లో జరుగు కాన్పుల విషయాలను గురించి జననీ సురక్ష ప్రోగ్రాం జననీ శిశు సురక్ష ప్రోగ్రామ్ గురించి గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్య నేరం కావున ఆడ పిల్లలను పుట్టిద్దాం ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం ఆడపిల్లను రక్షిద్దాం అనే నినాదంతో గర్భిణీ స్త్రీలు అందరికీ లింగ నిర్ధారణ చట్టం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రాజేష్ కుమార్ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య విలేజి హెల్త్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఏ.ఎన్.యంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రంతు

విశాలాంధ్ర - బద్వేలు : ఆంధ్రప్రదేశ్ ఏపీ రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్గా బద్వేల్ ప్రాంతానికి చెందిన సాధన కారి రంతును నియమించడం పట్ల బద్వేల్ ప్రాంత తెలుగుదేశం పార్టీనాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంతు మాట్లాడుతూ నాకు పదవి వచ్చేదానికి కారణమైన బద్వేలు మాజీ శాసనసభ్యులు విజయమ్మ కి యువ నాయకుడు రితీష్ కుమార్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు,

చంద్రబాబు అక్రమ అరెస్టుకు రెండేళ్లు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మచ్చ లేని చంద్రుడికి మసి పూసే కుట్ర చేసిన రోజు ఇది. మా నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నయుడును అక్రమ అరెస్టు చేసి రెండేళ్లు అయిందని తెలుగు వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపు రెడ్డి రవిశకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ(పతిక్షణం ప్రజల కోసం పరితపించే ప్రజా నాయకుడ్ని అక్రమ కేసులో ఇరికించి అరెస్టు చేసి పైశాచికానందం పొందిన రోజును బ్లాక్ డే. మా మనసులో ముద్ర పడిందన్నారు. 2023 సెప్టెంబర్ 9న మా నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ను అక్రమంగా అరెస్టు చేసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాక్షసానందం పొందాడన్నారు. అరెస్టు చేసి 53 రోజులు జైల్లో ఉంచినా ఒక్క ఆరోపణను రుజువు చేయలేకపోయారన్నారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా తెలుగుజాతి మొత్తం ఏకమై అరెస్టుకు వ్యతిరేకంగా గల మెత్తిన రోజు ఇది అన్నారు. ఎన్ని రోజులు జైల్లో పెట్టిన కడిగిన ముత్యంలా చంద్రబాబు నాయుడు బయటకు వచ్చారని ప్రజలు ఆయనకు పట్టం కట్టి ముఖ్యమంత్రి పీఠాన్ని రాష్ట్ర ప్రజలు ఆయనకు అంకితం చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షేమం ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమాలు అమలు చేయడంలో ఎనుకాడ లేదన్నారు. ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అధికారంలో ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని తెలిపారు. ఇప్పటికైనా ఆయన పైన నిందలు వేయాలని చూస్తే ప్రజలే వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

16న కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికుల ధర్నా

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పిలుపు

విశాలాంధ్ర- రాయచోటి రూరల్: ఫ్రీ బస్సు పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. మంగళవారం ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లు ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకంలో మరింత నష్టపోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆర్థికంగా ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. భారత న్యాయ సంహిత 2023 లో డ్రైవర్లను జైలు పాలు చేసే ప్రమాదకర హిట్ అండ్ రన్' చట్టంలో సెక్షన్ 106 1, 2 లను అమలు చేయడం వల్ల పొరపాటున ప్రమాదం జరిగితే డ్రైవర్లకు రూ.పది లక్షల వరకూ జరిమాన, జీవిత ఖైదు విధించాలని చెబుతుందన్నారు. ఆటో, క్యాబ్, టాటా ఏస్ డ్రైవర్లు, కార్మికుల కుటుంబాలు నష్టపోకుండా ప్రతి డ్రైవర్కు ఏడాదికి రూ. 25 వేల చొప్పున చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు

చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాయచోటి ఆర్టీవో కార్యాలయంలో ఆటోలకు ఎఫ్ సి చేయడంలో ఒకటిగా రెండు సార్లు అనేక సాకులు చూపి ఆటో డ్రైవర్లను ఇబ్బందులు పడుతున్నారని అలాంటివి మానుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమైన కూడలి లో ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు సెప్టెంబర్ 16న ఆటో డ్రైవర్ల సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ చిన్నమండెం నాయకులు రాజేష్ ఆటో డ్రైవర్స్ రహంతుల్లా, వెంకటరమణ, బాలు, ఆంజినేయులు,నాగముణి, మున్నా,నసిఫ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సిపీఎస్ ఉపాధ్యాయులకు డిఎ బకాయిలు చెల్లించాలి : ఎస్టీయు నేత వెంకటరెడ్డి

విశాలాంధ్ర -కలసపాడు : 2018 జులై, 2019 జనవరికి సంబంధించిన సిపిఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయు మండల శాఖ అధ్యక్షుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కలసపాడులో విలేకరులతో మాట్లాడుతూ బిల్లులు పెట్టి ఆదాయ పన్ను చెల్లించినప్పటికీ ఇప్పటికీ సిపిఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సినటువంటి అమౌంట్‌ను నగదు రూపంలో చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సచివాలయ ఉద్యోగులకు ఈ రెండు డీఏలకు సంబంధించి 60 నెలల బకాయిలని వారికి చెల్లించారు. కాని రాష్ట్రంలో మిగతా శాఖలలో పనిచేస్తున్నటువంటి సిపిఎస్ ఉద్యోగులకు ఎందుకు చెల్లించలేదని ఆయన ప్రశ్నించారు.వారికి కూడా తక్షణమే ఈ బకాయిలు చెల్లించాలి. అలాగే పీఆర్‌సీ బకాయిలు, పెండింగ్‌లో ఉన్నటువంటి 4 కరువు భత్యం బకాయిలను మొత్తం తక్షణమే చెల్లించి, కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చినటువంటి హామీలను నిలబెట్టుకోవాలన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై సమీక్ష

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : మండలంలోని టేకురుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారి, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, రాజశేఖర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మేరీ ఎల్సా, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ కరిష్మా పాల్గొని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ మరింత కృషి చేయాలన్నారు. కొత్రపాటిపల్లి గ్రామంలో మాత-శిశు సంరక్షణ సేవలను ఫీల్డ్ స్థాయిలో ప్రత్యక్షంగా ప్రజలకు అందుతున్న సేవల స్థితిగతులను పరిశీలించారు. ఈ సమావేశంలో పర్యవేక్షక సిబ్బంది సాదు వెంకటేశ్వర్లు, నిర్మలదేవి, రఘురామ్, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయానికి కుర్చీలు వితరణ

విశాలాంధ్ర -సుండుపల్లె : మండల పరిధిలోని ఆరోగ్యపురంలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం మంగళవారం సుండుపల్లి హెడ్ కానిస్టేబుల్ బీడీ నాయక్,దేవాలయంలో వచ్చే భక్తులకి కూర్చోవడానికి 25 కుర్చీలను వితరణగా ఇచ్చారు దేవాలయం తరఫున ఆయనను శాలువతో సత్కరించి ఆశీర్వాద వచనాలు చేశారు. భక్తులు ముందుకు వచ్చి దేవాలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. వారి కుటుంబ సభ్యులందరినీ ఆ వెంకటేశ్వర్లు స్వామి ఆయురారోగ్య అష్టైశ్వర్యాలు ధన ధాన్య సమృద్ధిగా ఇస్తారన్నారు.

ప్రభుత్వ వైద్య కాలేజీలను ప్రైవేటుపరం చేసే జివోను రద్దు చేయాలి

విశాలాంధ్ర-రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వైద్య కాలేజీలను ప్రైవేటుపరం (పిపిపి) చేస్తూ ఇచ్చిన ప్రజావ్యతిరేక జీవోను వెంటనే రద్దు చేయాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. భారత పార్లమెంటులో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఇండియా కూటమి ప్రధాన నాయకులు రాహుల్ గాంధీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష పార్టీ నాయకుడు, వైయస్సార్ సిపి అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డిలు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, నిరుద్యోగ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించి అఖిల పక్ష కమిటీలు ఏర్పాటు చేసి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఎదురొడ్డి పోరాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రజా కంఠకపు జీవో రద్దు కోసం ప్రజా ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.

హెచ్ఐవిపై ఖైదీలకు అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సొసైటీ ఆదేశాల మేరకు స్థానిక కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సబ్ జైల్లోనికి ఖైదీలకు హెచ్ఐవిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ వల్లి మాట్లాడుతూ హెచ్ఐవి వచ్చిన తర్వాత బాధపడే కంటే రాకముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. అలాగే ఐసిటిసి కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ యువత హెచ్ఐవి గురించి తెలుసుకోవడం చాలా మంచి నిర్ణయమన్నారు. డిఎస్ ఆర్ సి కౌన్సిలర్ బాలవల్లి మాట్లాడుతూ సుఖ వ్యాధులు హెచ్ఐవికి రహదారులు అని సూచించారు. ఇన్చార్జి జైలర్ కర్ణాకర్ మాట్లాడుతూ యువత సత్ప్రవర్తనతో మెలగాలని ఇలాంటి వ్యాధులు ఎలాంటి మత్తుపదార్థాలతో వెళ్ళకూడదని వివరించారు. ఈ కార్యక్రమంలో వలి, వెంకటసుబ్బయ్య, అనురాధ, నాగిన్ భాష సిడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తడి పొడి చెత్తపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర-చెన్నూరు: గ్రామాల్లోని మహిళలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించాలని డిప్యూటీ ఎంపీడీవో సురేష్బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మైనార్టీ కాలనీలోని ఎన్డబ్ల్యూపీసీ సెంటర్లో 5 మండలాల సీఆర్పీలకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీఆర్డీఏ నుంచి రీసోర్స్పర్సన్ రాజవర్ధిని, అమర్నాధ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్బాబు మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం వస్తేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సీకే దిన్నె, వల్లూరు, ఒంటిమిట్ట, ఖాజీపేట, సిద్దవటం మండలాల సీఆర్పీలు శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్మోహన్రావు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సురేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

- డైట్ లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-రాయచోటి: స్నేహభంధాల ఆరంభానికి , విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఫ్రెషర్స్ డే వేడుకలు తోడ్పడతాయని జిల్లా విద్యాశాఖాధికారి, డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. రాయచోటి జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో మంగళవారం కొత్త విద్యార్థులకు సాదర స్వాగతం పలికే ఫ్రెషర్స్ డే వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కొత్తగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులను పేరు పేరునా పలకరిస్తూ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ డైట్ విద్యాలయం ఛాత్రోపాధ్యాయులకు దేవాలయమని, ఇక్కడే భవిష్యత్తు ఉపాధ్యాయుల స్ఫూర్తి ఆవిష్కృతమవుతుందని తెలిపారు. ఇక్కడి శిక్షణ పొందిన వేలాది మంది ఉపాధ్యాయులుగా రాణిస్తూ ఎందరో విద్యార్థుల ను తీర్చి దిద్దుతున్నారన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే కొత్త విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా కళాశాల వాతావరణానికి అలవాటు పడేలా చేస్తుందన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు డీఈఓ బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో నాటకాలు, మిమిక్రీ, దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలతో విద్యార్థులు కళాత్మక ప్రతిభను ప్రదర్శించి అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం: డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: అన్నదానం మహాదామని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లికు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు తోపురెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తన మనవరాలు నిధిషా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వేంపల్లి నాగమ్మ నగర్ కాలనీలోని మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధుల ,అనాధ పిల్లల ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని,అందులోనూ వృద్ధులకు ,అనాథలకు సేవ చేయడం గొప్ప అవకాశమన్నారు. అన్నదానాన్ని తోపురెడ్డి రవీంద్రనాథ రెడ్డి తన మనవరాలు నిధిషా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వృద్ధుల ,అనాథాశ్రమంలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు సుజాత, పవన్ కుమార్ రెడ్డి,లక్ష్మీదేవి, ప్రసాద్ రెడ్డి,దేవి ప్రియాంక,నిత్యశ్రీ, దీపికా రెడ్డి,శిరీష,సతీష్ రెడ్డి ,ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న,ఐచర్ రమణ ,చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కల్పించాలి

విశాలాంధ్ర-రాయచోటి: క్లస్టర్ ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కల్పించాలని ఏపీయుఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సత్యనారాయణ కోరారు. పట్టణంలోని ఏపీయుఎస్ భవనంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నరసింహులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ క్లస్టర్ ఉపాధ్యాయులుగా నియమితులైన ఇంగ్లీష్, గణితం ఉపాధ్యాయులను డీస్సీ ద్వారా వచ్చే ఉపాధ్యాయుల కన్నా ముందే శాశ్వత స్థానాల్లో నియమించాలని డిమాండ్ చేశారు. ఆపస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన పీఫ్, ఏపీజీఎల్ఐసి బకాయిలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఆపస్ గౌరవ అధ్యక్షులు ఎస్ వి పరశురామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.నాగేంద్రబాబు, రాష్ట్ర సభ్యులు రామాంజనేయులు, భూషణయ్య, నాగరాజు, సుబ్బయ్య, మద్దయ్య, మల్లికార్జున శెట్టి, రమణ, నాగేంద్ర ప్రసాద్, నాగేంద్రబాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ను కలిసిన గోవర్ధన్

విశాలాంధ్ర- పీలేరు: ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, వైద్య విద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ గా సౌరబ్ గౌర్(ఐఏఎస్) నియమించబడిన సందర్భంగా పీలేరు కు చెందిన గోవర్ధన్ కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతు రాష్ట్ర%శీ% లోని అన్నిగ్రామీణ, ఏరియాఆసుపత్రి లలో ఆధునిక, మౌళిక సౌకర్యాలు కల్పించాలని, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, సకాలంలోఆరోగ్య, వైద్య విద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖసమస్యలనుపరిష్కరించుటకు కృషి చేయాలని కోరారు.

రసాభాసగా ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- కమిషనర్ క్షమాపణ చెప్పాలి
- వైసీపీ కౌన్సిలర్ల పట్టు
- క్షమాపణ చెప్పరు..
- అధికారులకు ఫిర్యాదు చేసుకోండి
- ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఆగస్టు 30న నిర్వహించాలని కోరుతూ చైర్పర్సన్ గత నెల 22వ తేదిన సూచించగా ఫ్రీ అంబుల్ తయారు చేసి పంపాలని అన్ని శాఖలకు కమీషనర్ ఆదేశాలు ఇచ్చారు అయితే ఆగస్టు 28వ తేది చైర్పర్సన్ కమీషనర్కు ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయకుండా సమాధానం చెప్పలేదని వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సభలో ప్రశ్నిస్తూ చైర్మెన్కు కమీషనర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అత్యవసర సమావేశం మంగళవారం సాయంత్రం చైర్మెన్ భీమునివల్ల లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ముఖ్య అతిధిగా హాజరు అయ్యారు. ఈ సంధర్భంగా వైస్ చైర్మెన్ పీఎస్ ఖాజా మాట్లాడుతూ గత నెలలో సమావేశం నిర్వహించాలని చైర్మెన్ ఫోన్ చేసినా మీరు ఎందుకు ఫోన్ ఎత్తలేదని అందుకు సమాధానం చెప్పాలని లేని పక్షంలో క్షమాపణ చెప్పాలని కోరారు. అందుకు కమీషనర్ స్పందించి మాట్లాడుతూ తాను విజిలెన్స్ ఎన్క్వయిరీలో ఉన్నానని అందుకు ఫోన్ ఎత్తలేదని సీసీకి ఫోన్ చేసి చెప్పానని సభలో సమాధానం తెలిపారు. వైసీపీ కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, రాగుల శాంతి, గుర్రం లావణ్య, వెంకట మ్మలు ఛాంబర్ వద్ద భైఠాయించి కమీషనర్ చైర్మెన్కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కమీషనర్ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించి ఎమ్మెల్యే లేచి బయటికి రావడంతో కమీషనర్, అధికారులు సమావేశం ముందర నుండి బయటికి వచ్చారు.

సంక్షిప్త వార్తలు

17న క్రీడా పోటీలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు,క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్(నెహ్రూ యువ కేంద్రం) కడప జిల్లాలో వారి సహకారంతో ప్రొద్దుటూరు వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదిన యువకులకు వాలీబాల్ టోర్నమెంట్ అలాగే మహిళలకు కబడ్డి టోర్నమెంట్ను స్థానిక అనిబిసెంట్ హైస్కూల్ గ్రౌండ్లో నిర్వహిస్తున్నట్లు వికసిత ఫౌండేషన్ చైర్మెన్ శూలం లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 25సంవత్సరాలు లోపు గల యువతీ యువకులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ ప్రతిభను నిరూపించుకోవాలని తెలిపారు. అలాగే పురుషులకు వాలీబాల్ టోర్నమెంట్ మరియు స్త్రీలకు కబడ్డీ పోటీలలో పాల్గొనదలచిన వారు 99664 75742, 91541 95061 అనే ఈ నంబర్లకు సంప్రదించాలని కోరారు. గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ. 10వేలు, రెండవ బహుమతిగా రూ.7 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం బహుకరిస్తారని ఆమె తెలిపారు.

ఏపీ శాక్స్ పీడీతో యూనియన్ ప్రతినిధుల భేటీ

విశాలాంధ్ర -రాజంపేట: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కె. నీలకంఠరెడ్డి ఐఏఎస్ ను ఉద్యోగుల సంఘం (హెచ్-110) ప్రతినిధులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటసుబ్బయ్య ,రాష్ట్రాధ్యక్షుడు సుదర్శి వేణు , ఇతర ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల కు దీర్ఘకాలికంగా ఉన్నటువంటి పలు సమస్యలను సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా ఉద్యోగుల జీతభత్యాలు, హాజరు విధానాలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగ భద్రత, సేవా నిబంధనల అమలు వంటి అంశాలను ప్రస్తావించి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు. ప్రతినిధుల విన్నపాలను శ్రద్ధగా విన్న ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ రెడ్డి ఉద్యోగుల ఆందోళనలు సమంజసమని పేర్కొని, సమస్యల పరిష్కారం కోసం సానుకూల దృక్పథంతో చర్యలు తీసుకుంటామని సంఘ ప్రతినిధులకు హామీ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, పలువురు జిల్లా స్థాయి ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జగన్ రాజుకు మట్లి, ఎల్లంపల్లిలో ఘన స్వాగతం

విశాలాంధ్ర -వీరబల్లి :రాజంపేట టిడిపి ఇంచార్జి జగన్ మోహన్ రాజుకు మట్లి గ్రామ సర్పంచి నాగార్జున ఆవారి ఆధ్వ ర్యంలో ఘనంగా జగన్ రాజుకు అపూర్వ స్వాగతం,, పలికారు ముందుగా మట్లి వడ్డిపల్లె ఎల్లంపల్లి సంఘం వాళ్ళ పల్లి పెద్దివీడు మంగళపల్లి సంఘం వాళ్ళ పల్లి నెలవాండ్లపల్లి తెలుగుదేశం కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు అనంతరం వీరబల్లిలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఆయన మాట్లా డుతూ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి వారి వారి సమస్యలు పరిష్కరిస్తారని ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు ఈ కార్యక్ర మంలో మండల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యూరియాను సమతుల్యంగా వాడాలి :ఎంపీడీవో వరప్రసాద్

విశాలాంధ్ర -రాజంపేట: పంటలు సాగు చేస్తున్న రైతులందరూ సమతుల్య యూరి యాను వాడాలని రాజంపేట ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. మంగళవారం మండ లంలోని పెద్దకారం పల్లె , ఆర్ బుడుగుంట పల్లె పంచాయతీలలో సమతుల్య యూరి యా వాడకంపై రైతులకు ప్రత్యేక అవగా హన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద కారం పల్లె, ఆర్ బుడుగుంట పల్లి పంచాయతీ కార్యదర్శులు రామ్మూర్తి, కరిముల్లా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీవ సంబంధ ఎరువుల వినియోగం భూమికి మేలు

విశాలాంధ్ర-రామాపురం :జీవ సంబంధ ఎరువుల వినియోగం భూమికి ఎంతో మేలు జరుగుతుందని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాని అన్నారు. మండలంలోని కల్పిరెడ్డిగారిపల్లి కల్లు నాయుని చెరువు గ్రామ సచివాలయాల్లో మంగళవారం రైతులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలని రైతులకు సూచించారు. మండలి వ్యవసాయ అధికా రిని వై. నాగమణి మాట్లాడుతూ మండలం లో యూరియా కొరత లేదని గ్రామ సచివాలయాల్లో యూరియా నిల్వ ఉందని కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద కు వచ్చి కావాల్సిన ఎరువులను తీసుకు వెళ్ళచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని వై నాగమణి ఎంపీడీవో జాషువా తాసిల్దార్ వెంకటేశ్వర్లు రైతులు పకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఫ్రీ బస్సు ఎక్కడ?

ప్రభుత్వ పథకాలు ప్రచారం కోసమేనా?
గంటల తరబడి ఫ్రీ బస్సు కోసం పడిగాపులు
సిఎం ప్రోగ్రాం పేరుతో బస్సులు ఆపేసిన వైనం
ఉచిత బస్సుల అందుబాటులో ఉంచాలి
సిపిఐ నేతల డిమాండ్

విశాలాంధ్ర-మదనపల్లె:మదనపల్లి ఆర్టీసీ డిపో నందు ఫ్రీ బస్సులు కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్న మహిళలకు, విద్యా ర్థినిలకు బస్సును ఏర్పాటు చేయాలని ఆర్టీసీ బస్టాండ్‌లో సీపీఐ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కృష్ణప్ప,మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా మహిళ లందరికీ ఆర్టిసి బస్సులలో ఉచిత ప్రయాణం అందించామని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ ఇది ఆచరణలో సాధ్యం కాలేదు అన్నారు. మదనపల్లి నుండి తిరుపతికి వెళ్ళు కాలేజ్ విద్యార్థినీలు, మహిళలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక్క గంట వరకు ఎదురుచూస్తున్న ఒక్క బస్సు కూడా రాలేదని అన్నారు. ఆర్టీసీ అధికారులను అడిగితే ఫ్రీ బస్సులు ఈరోజు రావని,ఎక్స్ప్రెస్ బస్సులు అన్ని సిఎం మీటింగ్ కి వెళ్ళాయని,మీరందరూ నాన్ స్టాప్ బస్సులోనే ప్రయాణం చేయాలని,నాన్ స్టాప్ బస్సుల్లో 270 రూపాయలు టికెట్ అవుతుందని, టికెట్ కొనుక్కొని ప్రయాణం చేయాలని చెబుతున్నారని అన్నారు. సీఎం మీటింగ్ కు కేవలం ఎక్స్ప్రెస్ బస్సులు మాత్రమే ఎందుకు కేటాయించాలని,నాన్ స్టాప్ బస్సులు వదులు సంఖ్యలో ప్లాట్‌ఫారం పైకి వస్తున్నాయని, ఎక్స్ప్రెస్ బస్సులన్నీతిరుపతి నుండి వచ్చే ప్రతి ఒక్క బస్సు గ్యారేజ్ లోకి వెళ్తున్నాయి తప్ప, ప్లాట్ఫారం పైకి ఒక్క బస్సు కూడా రాలేదన్నారు. ఎక్స్ప్రెస్ బస్సులు లేకపోతే నాన్ స్టాప్ బస్సుల్లో ఫ్రీగ వెళ్ళడానికి అను మతులు జారీచేయాలని,ఇక్కడున్న మహిళల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారని, వారు ఆధార్ కార్డులు తెచ్చుకున్నారని,టికెట్కు డబ్బులు తీర్చుకోకపోతే వారి పరిస్థితి ఏమని ప్రశ్నించారు. ఆర్టీసీ అధికారులు ఉద్దేశపూర్వ కంగానే ఫ్రీ బస్సులను ఆపి నాన్ స్టాప్ బస్సు లను తిప్పుతున్నారని ఆరోపణ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి మహిళలకు,విద్యార్థినిలకు ఆల్టర్నేటివ్ బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మదనపల్లి మండల కార్యదర్శి రెడ్డి శేఖర్,పట్టణ కార్య దర్శి మాధవ కుమార్,సాయి మరియు మహిళలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తే అధిక దిగుబడులు

విశాలాంధ్ర-గాలివీడు: రసాయనిక ఎరు వుల వాడకం తగ్గిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి గౌతమి పేర్కొన్నారు. మంగళ వారం మండలంలోని గుండ్లచెరువు గ్రామంలో తాసిల్దార్ భాగ్యలత, గోరాన్ చెరువు గ్రామంలో ప్రత్యేక అధికారి వెంకటరత్నం, వెలిగల్లులో ఎంపిడిఓ చంద్రమౌళీశ్వర్, గరుగుపల్లి గ్రామంలో ఏవో గౌతమి ఆధ్వర్యంలో రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులకు ద్రువ జీవామృతం తయారీ విధానం ఏపీసీ ఎన్ఎఫ్ సిబ్బంది డెమో ఇచ్చారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం :మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి

విశాలాంధ్ర - బద్వేలు : సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి సూచించారు. పట్టణ పరిధిలోని గాంధీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సెక్రటరీలు ఆరోగ్య కేంద్ర సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందించే వైద్యసేవలు,రికార్డులు నిర్వహణ అంశాలపై మెడికల్ ఆఫీసర్‌ను పీహెచ్ సి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పురపాలక పరిధిలో గాంధీ నగర్,కోటవీధి ,గుంతపల్లెలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వున్నాయని వాటి సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. శరత్ చంద్ర, డా.శ్రీనివాసులు, డా. సౌమ్య,హెల్త్ సూపర్వైజర్ శివరామిరెడ్డి హెల్త్ సెక్రెటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలు భోజనాన్ని ఏర్పాటుచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం నుండి భోజనాలను ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందించారు. భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయం నుండి ప్రతి నెల 9వ తేదీన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భవతులకు ,బాలింతలకు వైద్య పరీక్షలకు వచ్చే వారికి ఆకలి కడుపుతో వెళ్లకూడదని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు భోజన సదుపాయం అందజేస్తున్నట్లు వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి పర్యవేక్షణలోగర్భిణీ మహిళలకు అన్నం పంపిణీ చేశారు, ఈ సందర్భంగావైద్యాధికారి సంపత్ కుమార్ మాట్లాడుతూ గర్భిణీలకు బాలింతలకు బ్రహ్మంగారి ఆలయం నుండి భోజన సదుపాయం ఏర్పాటు చేయడం చాలా మంచిదన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోష తగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలి

విశాలాంధ్ర-కడప : కడప మండ లంలోని పాతకడప గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి యస్. వి. సురేష్ కుమార్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేలైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి, వ్యవసాయ ఖర్చులను, తగ్గించి ఆరోగ్యవంతమైన పంటలను పండించాలని రైతులను తెలియజేశారు యూరియా ఎరువు వరి పైరుకు ఎకరానికి 70 కేజీ లు సరిపోతుందని తెలిపారు యూరియా ఎరువును సమతుల్యంగా వినియోగించడం చాలా ముఖ్యమని తెలిపారు లేనియెడల భూసారం క్రమంగా తగ్గిపోతుందని భూగర్భ జలాలు నీటి వాగులు కలుషితమవుతాయని పంటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుందని సాగు ఖర్చు పెరిగి లాభం తగ్గుతుందని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి. దస్తగిరి ఆత్మ ఏటిఎం రాధిక మరియు రైతులు పాల్గొన్నారు.

యూరియా వాడకంపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర -రాజంపేట: రైతు సాగు చేసే పంటల్లో అధిక లాభాలు పొందాలంటే యూరియా వాడకంపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ అధికారి నాగలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలి గ్రామపంచాయతీలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన ఎరువులు, అజోబ్యాక్టర్, రైజోబియం వాడకం వలన తక్కువ ఖర్చుతో నత్రజని లభ్యం, భూసారం పొందవచ్చు అన్నారు. దీనివలన 20 నుండి 20 శాతం నత్రజనిని ఆదా చేయవచ్చు అని తెలిపారు. అలాగే నానో యూరి యాను పై పాటుగా పంట కాలంలో రెండు మూడు దఫాలుగా పిచికారి చేయడం వలన 80 శాతం నత్రజని పెంచడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించుకోవచ్చు అని అలాగే దిగుబడిలో ఎటువంటి తగ్గుదల ఉండదని వాడిని రైతులు తెలియజేశారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ గురు ప్రకాష్ మాట్లాడుతూ యూరియా అధిక మోతాదులో వాడడం వలన భూసారం క్రమంగా తగ్గిపోతుందని, అలాగే పంటలకు చీడపీడల ఉధృతి పెరిగి సేద్య ఖర్చులు పెరిగి లాభం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రామ్మోహన్ రాజు రైతులు పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని సేవా పక్షోత్సవాలు

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : రాయచోటిలోని సాయి సుధా కళ్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ అధ్యక్షతన సేవా పక్షోత్సవాల జిల్లా కార్యాలయాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బిజెపి సేవా పక్షోత్సవాల రాష్ట్ర కన్వీనర్ కాపు రామచంద్రారెడ్డి, నం ద్యాల జిల్లా ఇన్చార్జి పోతు గుంట రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు వారి జన్మదినాన్ని పురస్కరించుకొని వివిధ రకాల సేవా కార్యక్రమాలు దేశవ్యాప్తంగా నిర్వహించాలన్నారు. అందులో భాగంగా మన జిల్లాలో కూడా రక్తదాన శిబిరాలు, చెట్లు నాటడం, వికలాంగులకు పరికరాలు పంచడం, స్వచ్ఛభారత్ నిర్వహించా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లి ప్రశాంత్ ఆనంద్ గజపతిరాజు, గోపాల్ రెడ్డి, రంగారెడ్డి, డాక్టర్ పాలగిరి శ్రీనివాసరాజు, నిర్మల్ కుమార్, కొత్తూరు శ్రీకాంత్ అన్ని మండలాల అధ్యక్షులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

విశాలాంధ్ర-రామసముద్రం : మండలంలోని మినికి అరికెల సచివాలయాలలో మంగళ వారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి జాఫర్ తెలిపారు రెండు సచివాలయాల పరిధిలో రైతులకు 444 బస్తాలు పంపిణీ చేసినట్లు చెప్పారు రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కావలసిన మేరకు యూరియా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నారు తహసిల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ యూరియా సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని సచివాలయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వసీం వ్యవసాయ అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాచమల్లు ఆధ్వర్యంలో రైతు పోరుబాట

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు పోరుబాట కార్యక్రమం జరిగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి రైతు పోరుబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు భారీగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభం కాగానే పోలీసులు అక్కడికి చేరుకొని ర్యాలీకి అనుమతి లేదని 30యాక్ట్ అమలులో ఉందని, ర్యాలీ నిర్వహించరాదని అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ రైతుల కోసం పోరాటం వారి సమస్యల పట్ల స్పందించి ప్రభుత్వం దృష్టికి రైతులు సమస్యలు తీసుకెళ్లడానికి రైతు పోరుబాట నిర్వహిస్తుంటే ఇలా అడ్డుకోవడం తగదని అన్నారు. చంద్రబాబు రైతు వ్యతిరేకి అని రైతులు అన్న వ్యవసాయం అన్నా చంద్రబాబుకు గిట్టదని అందుకే రైతులను వంచన చేస్తున్నారని ఆరోపించారు. ఎరువులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రభుత్వంలో చలనం లేదని అన్నారు. రైతులకు సబ్సిడీ ద్వారా ఎరువులు, విత్తనాలు అందించడమే కాకుండా రైతు భరోసా 20వేలు చెల్లించాలని

డిమాండ్ చేశారు. వైసీపీ శ్రేణులు, రైతులు పెద్దఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఏడీఏ కార్యాలయం చేరుకుంది. ఏడీఏ అనితకు వినతిపత్రాన్ని అందించారు.

మెరుగైన సంతానానికి పౌష్టికాహారం -డా:చంద్రశేఖర్

విశాలాంధ్ర- పీలేరు: ఆరోగ్య పరీక్షలతోనే తల్లి బిడ్డ క్షేమమని అందుకు డాక్టర్లు సూచించిన ఆరోగ్య నియమాలు పాటించాలని డా: చంద్రశేఖర్ తల్లులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పీహెచ్ సి తలుపులలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు డాక్టర్ చంద్రశేఖర్ ఆరోగ్య సేవలు సూచనలు తెలిజేశారు. రక్త,మూత్ర పరీక్షల సహకారంతో,హిమోగ్లోబిన్ (హెచ్ బి)అల్బిమిన్, అధిక రక్త పోటు, మధుమేహం మొదలగు ఆరోగ్య సమస్యల నిర్ధారించి, అవరమగు సూచనలో భాగంగా మాంసకృతులు, ఆకుకూరలు, క్యాల్షియం, విటమిన్లు, కొవ్వు పదార్థాలు తీసుకోవాలని, కడుపునొప్పి, ఆయాసం, నీరసం, కాళ్లవాపు , జ్వరం, లక్షణాలు ఉన్నట్లయితే ప్రమాదకరంగా భావించి తక్షణమే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స సలహాలకై సందర్శించాలని తెలిపారు.తర్వాత పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న డా: చంద్రశేఖర్ సహకారంతో,26 మంది గర్భిణీ స్త్రీలకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో డిప్యూటి హెచ్ ఇఓ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, ఏఎన్ఎం ఫామున్ని సా, నాగవేణి,ప్రమీల, సిహెచ్ఓ కుముదా, ఆశా కార్యకర్తలు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది కార్మికుల వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర-పీలేరు : పీలేరు పంచాయతీ కార్యాలయంలో 46 మంది పారిశుధ్య సిబ్బంది కార్మికులకు గత సంవత్సరం మే జూన్ రెండు మాసాల వేతనాలను అప్పటి ఈవో గురు మోహన్ కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించుకొని జీతాలు ఇవ్వలేదని పీలేరు పంచాయతీ యూనియన్ అధ్యక్షులు రమణ, డి వెంకటరామయ్య ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా పంచాయతీ బోర్డు సభ్యులు పంపిన జీతం 3000 రూపాయలు కూడా గురు మోహన్ అందులో రూ.1000 తగ్గించారని ఇదే విషయంపై పీలేరు శాసనసభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారులు కూడా అనేక మార్లు వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. గత ఈవో అధికార మతంతో కావాలనే కార్మికులు అంటే చిన్న చూపులతో కార్మికులకు బానిసలుగా చూశారని వారు ఆరోపించారు ఇప్పటికీ చాలీచాలని జీతాలతో తాము దీన పరిస్థితిలో ఉన్నామని తెలిపారు ఇప్పటికైనా తమకు

రావలసిన 46 మంది సిబ్బంది కారు మీద పారిశుద్ధ్య కార్మికులకు దాదాపు 11 లక్షల రూపాయలు జీతంభత్యాలు చెల్లిం చాలని అలాగే గత ఈవో గురు మోహన్ పై చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు ఇదే విషయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జిల్లా పంచాయతీ అధికారులకు ఇలా కలెక్టర్కు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ పారిశుద్ధ కార్మికులు పులి రెడ్డప్ప నాగార్జున రమణ ఓబులయ్య సుబ్రహ్మణ్యం యాకూబ్ శాంతకుమారి రాజేశ్వరి చిట్టమ్మ రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రైతన్నలకు ఎరువులు అందించాలి- మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పీలేరు:సకాలంలో రైతన్నలకు ఎరువులు అందించాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు యూరియా, విత్తనాలు అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ద్వంద వైఖరికి నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతన్నకు బాసటగా అన్నదాత పోరు కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లినిరసన వ్యక్తం చేశామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ అన్న మయ్య జిల్లా ఏవో నాగభూషణంకు వినతి పత్రాన్ని అందజేశారు.కొరముట్ల శ్రీనివాసులు కడప మేయర్ సురేష్ బాబు, సమన్వయ కర్త నిసార్ అహ్మద్,రాజంపేట ఇంచార్జి అకేపాటి అనిల్ కుమార్ రెడ్డి ,వైసీసిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డి,వైసీపి రాష్ట్ర యువత విభాగం కార్యదర్శి రాహుల్ చక్రవర్తి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు, వైకాపా నాయకలు మరియు కార్యకర్తలతో కలిసి వినతిపత్రం సమర్పించారు.

గర్భిణీలకు ఉచిత స్కానింగ్ పరీక్షలు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : గైనకాలజిస్ట్ డాక్టర్ మృదుల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు ఉచిత స్కానింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ప్రధానమంత్రి మాతృ శిశు సంక్షేమ పథకం క్రింద ప్రతి నెలా ఉచిత స్కానింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని మహిళలు ఈ అవకాశాన్ని

సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ సరోజమ్మ, ఏఎన్ఎమ్‌లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రైతు పోరుబాటలో మాజీ ఎమ్మెల్యే రవి రెడ్డి

విశాలాంధ్ర-చెన్నూరు : కూటమి ప్రభుత్వం తరంలోకి వచ్చినప్పటినుండి రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోనని రైతులను పూర్తిగా పట్టించుకోవడంలేదని వైసీపీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు కమలాపురంలో నిర్వహించిన రైతు పోరుబాటలో కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నరేన్ రామానుజుల రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అయినప్పటికీ ఏ సామాజిక వర్గానికి మేలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ ఊదరగొడుతున్నారు తప్ప వాటి వల్ల ఎవరికి ప్రయోజనం కలిగింది అనేది చెప్పలేదు అన్నారు. గతంలో మనదేశంలో ఆంగ్లేయుల పాలనలో అనంతరం ఇందిరా గాంధీ పాలనలో ఎమర్జెన్సీ

ప్రవేశపెట్టడం జరిగిందని కానీ ఇప్పుడు చంద్రబాబు నాయుడు పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. రాష్ట్రంలో రైతులకు యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిన ఇప్పటివరకు రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేసిన పాపాన పోలేదన్నారు. అరకొరగా వచ్చే యూరియా పోలీసుల భద్రత మధ్య పంపిణీ చేసే దుర్భర స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా కొరతపై రైతులు గాని ప్రతిపక్ష నేతలు గాని ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించడం జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు వ్యవసాయం దండగ అన్నాడని అదే వ్యవసాయం పండగ అని వైయస్ రాజశేఖర్ రెడ్డి నిరూపించాలన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతులు కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటలకు బీమా. ఇన్పుట్ సబ్సిడీ తరాలు కల్పించిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. కరోనా కష్టకాలంలో దీని రైతుల కోసం ప్రత్యేకంగా రైలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను ఇబ్బందులకు గురి చేసే పార్టీలకు ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవన్నారు. అనంతరం వైసీపీ కార్యాలయం నుండి వేలాది మంది రైతులు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి రైతు సేవా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రైతులకు సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వ్యవసాయ శాఖ ఏడీ నరసింహారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూస్ రీల్

యూరియా కొరత లేదు

అవసరాన్ని దాటి యూరియా అందించాం
రూ.1200 మద్దతు ధరతో ఉల్లి కొనుగోలు
డీఏపీ కూడా అందుబాటులో ఉంది
ఏడీఏ నరసింహారెడ్డి

విశాలాంధ్ర-చెన్నూరు : కమలాపురం డివిజన్ పరిధిలో యూరియా కొరతలేదని కమలాపురం వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళ వారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తన డివిజన్ పపరిధిలోని కమలాపురం, వల్లూరు, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మండలాల్లో సుమారు 4,438 హెక్టార్లలో రైతులు పంటలు సాగుచేశారని ఇందులో 1650 హెక్టార్లు వరి సాగు చేశారన్నారు. సాగు చేసిన పంటలకు 500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే ఇప్పటికే ప్రైవేట్ డీలర్ల ద్వారా172, రైతు సేవా కేంద్రాల ద్వారా782, మన గ్రోమోర్ కేంద్రాల ద్వారా 100 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. ప్రస్తుతం చిన్న చెప్పలి, సంబటూరు కేంద్రాల్లో 20మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉందని త్వరలో అన్ని కేంద్రాల్లో సరపరా చేస్తామని అవసరమైన రైతులు వినియోగించుకోవాలని కోరారు.కమలాపురం మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లికి రూ.1200 మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని రైతులు వినియోగించుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి కోరారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలపై డీపీఓతో చర్చించిన తులసి రెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె పంచాయతీ సిబ్బంది సమస్యలపై మంగళవారం డీపీవోతో డాక్టర్ ఎన్ తులసిరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లి గ్రామ పంచాయతీకి రెగ్యులర్ ఈవో గత ఆరు నెలలుగా లేరన్నారు. గత ఆరు నెలలుగా పారిశుద్ధ్య, మంచినీటి సరఫరా సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. గత వారం రోజులుగా సిబ్బంది సమ్మెలో ఉన్నారని, దీని వలన పంచాయతీ మురికి కూపంగా తయారయిందన్నారు. ఈ సమస్యలపై కాంగ్రెస్ నాయకులు ధ్రువ కుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ తదితరులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జిల్లా పంచాయతీ అధికారిని రాజ్యలక్ష్మి, డీఎల్ పీఓ రమాదేవి వేంపల్లె కు వచ్చి సిబ్బందితోను, నాయకులతోను చర్చించారన్నారు. సిబ్బంది జీతాలు వెంటనే చెల్లిస్తామని హామీ నిచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవ కుమార్ రెడ్డి, టీడీపీ నాయకులు షబ్బీర్, వైసిపి నేత సాదక్, ఏఐటీయూసీ నేత బాదుల్లా, భవన నిర్మాణ కార్మికుల సంఘం నేత ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు లేక చితికిపోతున్న బాల్యం

- అర్ధంతరంగా ఆగిన అంగన్వాడి భవనాలు
- అద్దె రూములే దిక్కు
- చిన్నారులకు తప్పని తిప్పలు

విశాలాంధ్ర-సుండుపల్లె: గత వైసీపీ ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పి.నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పింది. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే ఇందుకు భిన్నంగా కనిపిస్తుంది. మండల వ్యాప్తంగా అంగన్ వాడీ కేంద్రాలు అధ్వానంగా మారి సమస్యలతో సతమతమౌతున్నాయి.కనీస సౌకర్యాలు, మరుగు దొడ్లు, తాగునీరు వంటి వసతులు లేకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మార్పు జరుగుతుంది అనుకున్నరు. ప్రభుత్వం నుంచి సకాలంలో అద్దె బిల్లులు రాకపోవడంతో అంగన్వాడి కార్యకర్తలు సొంతంగా చెల్లించాల్సి వస్తుందని. నూతనంగా ప్రారంభించిన భవనాలు అర్ధంతరంగా ఆగి, మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా అంగన్వాడీ భవన నిర్మాణాలు పూర్తిచేసేలా నిధులు మంజూరు చేయాలేదు.

26 భవనాల నిర్మాణాలకే నిధులు రాక..

సుండుపల్లి మండల వ్యాప్తంగా 26 అంగన్వాడీ భవనాల నిర్మాణానికి గత వైసిపి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.మండల వ్యాప్తంగా 115 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి.వాటిలో 79 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు 36 మినీ అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి.కేవలం 26 అంగన్వాడి కేంద్రాల నిర్మాణానికి గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.

ఆరేళ్ళుగా గునాదులు.. మొండి గోడలే..

అంగన్వాడీ కార్యకర్తలకు వైసిపి పాలనలో నిరాశ ఎదురైంది.కూటమి ప్రభుత్వం లోనైనా పూర్తవుతాయని ఎదురుచూసిన కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల పూర్తి అయినా నిధులు కేటాయించకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి మండల వ్యాప్తంగా దాదాపు 35 అంగన్వాడీ కేంద్రాలు పెండింగ్ లో ఉన్నాయి.

నిధులు లేకనే నిర్మాణం ఆగింది

“ సుండుపల్లె మండల వ్యాప్తంగా 35అంగన్వాడి భవనాలు నిధులు లేక అర్ధాంతరంగా ఆగి ఉన్నాయి. వీటి నివేదికలను పిడి కార్యాలయానికి పంపించాం. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయగానే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం. భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందు చొరవ తీసుకుంటాం.

- రాజమ్మ, సిడిపిఓ

నిధులు మంజూరైతే భవనాలు పూర్తి చేస్తాం

“ ప్రభుత్వం నుండి ఏదైనా ప్రత్యేక నిధులు మంజూరు అయితే అంగన్వాడి భవనాలను పునః ప్రారంభిస్తాం. మండల నిధులు, ఆగిన అంగన్వాడి భవనాలకు సర్దుబాటు కాలేదు. ఉన్నాతాధికారులకు నివేదిస్తాం.

- మండల అభివృద్ధి అధికారి ఎస్.సుధాకర్ రెడ్డి

యూరియా సరిపడా నిల్వలు: కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలు పుష్కళంగా ఉన్నాయని.. ప్రణాళికా బద్ధంగా పంపిణీ కార్యక్రమం సాగుతోందని.. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ లోని విసి హాలులో జిల్లాలో యూరియా నిల్వలు, పంపిణీపై జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ కమ జెసి అతిథిసింగ్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను.. అక్రమంగా విక్రయించడం లేదా ఇతర అవసరాలకు మళ్లించినా.. వారిపై చట్టపంమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో లక్షా ఎకరాల్లో వారి సాగుబడి ప్రణాలికను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరాకు సంబంధించి పోలీసు శాఖ ప్రత్యేక సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రణాళికాబద్ధంగా ఎరువులు, విత్తనాల పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షించడం జరుగుతొందన్నారు. యూరియా కొరత ఉందంటూ.. సోషల్ మీడియాలో వచ్చే వదంతలను నమ్మవద్దని, అలాంటి తప్పుడు సమాచారం ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల పంపిణీ సమయంలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం నుండి అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రా నాయక్, ఎపి మార్క్ ఫెడ్ డిఎం పరిమళ జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల పోరులో కదంతొక్కిన కర్షకులు

- ప్రభుత్వ చేతగానితనంతోనే ఎరువుల కొరత
- బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న కూటమి నాయకులు
- అన్నదాతల పోరులో ధ్వజమెత్తిన వైసిపి నాయకులు

విశాలాంధ్ర-పులివెందుల: రైతన్నల పోరులో కర్షకులు కదంతొక్కారు. కూటమి ప్రభుత్వం చేతగానితనంలోనే ఎరువుల కొరత.. అధికారపార్టీ నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ప్రభుత్వం చోద్యంచూస్తోంది అంటూ వైసిపి నాయకులు ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి అధినేత జగన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో పులివెందుల పట్టణంలో వైసిపి శ్రేణులు నిర్వహించిన ఎరువులు కొరత ర్యాలీ కార్యక్రమానికి వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్ వైసిపి ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 30 ఆక్ట్ అమల్లో ఉన్నప్పటికీ వైసీపీ శ్రేణులు నిబంధనలకు విరుద్దంగా పులివెందులలో ర్యాలీ నిర్వహించారు రాష్ట్రవ్యాప్తంగా అరెస్టులు జరిగినప్పటికీ పులివెందులలో పోలీసులు ఫోర్స్ అధిక సంఖ్యలో లేకపోవడం వల్ల బార్కెట్లను ఏర్పాటు చేసినప్పటికీ ఆ బారికెట్లను తొలగించి వైసీపీ శ్రేణులు ముందుకెళ్లాయి పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధి గుండా ఆర్డీవో కార్యాలయం వరకు వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మురళి నాయక్ ,సిఐలు సీతారాంరెడ్డి ,రమణ తదితరులు వైసీపీ శ్రేణులను ఎక్కడికక్కడ నిలువరించాలని చూసినప్పటికీ వైసీపీ శ్రేణులు ఆగకుండా ముందుకు సాగారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ఈ ర్యాలీని నిర్వహించి అక్కడ ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో ఆర్డీవో కార్యాలయంలోని డిప్యూటీ తాసిల్దార్ నాగేంద్రకు వినతిపత్రాన్ని అందించారు అనంతరం సతీష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు అవుతున్నప్పటికీ ఎలాంటి రైతు ప్రయోజన కార్యక్రమాలను కూడా చేపట్టలేదు అన్నారు కూటమి ప్రభుత్వం లోని నాయకులు ఎరువులను దారి మళ్లించడం వల్లనే ఎరువుల కొడతా ఏర్పడింది అన్నారు. వైసిపి ప్రభుత్వం హయాములో చిరుధాన్యాల రేట్లు అధికంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం చిరుధాన్యాల రేట్లు అత్యల్పంగా ఉన్నయన్నారు . పంటల బీమా విషయంలో కూడా ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఎరువులను రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రాఘవరెడ్డి వరప్రసాద్, ఓతూరు రసూల్ నియోజకవర్గం వ్యాప్తంగా వైకాపా నాయకులు, ప్రజా ప్రతినిధులు, కర్తలతో పాటు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధ్యాయుడికి ఘనసన్మానం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన సయ్యద్ నూర్, ప్రధానోపాధ్యాయులు, ఎం.పి.యు.పి. ఉర్దూ పాఠశాల, సిద్దిక్ నగర్, వై.ఎస్.ఆర్. కాలనీ, కడపలో పనిచేస్తున్న సయ్యద్ నూర్ ను 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, ఎస్.ఎం.సి. కమిటీ చైర్మన్ ఎస్.ఖాదర్ బాషాలు పాఠశాల ఉపాధ్యాయులు శాలువా కప్పి, పుషగుచ్చంతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుబ్బారెడ్డి మాట్లాడుతు అవార్డు గ్రహీత సేవలను ప్రభుత్వం గుర్తించి ఇవ్వడం మనందరికీ గర్వకారణం అన్నారు. పాఠశాల సమస్యలు పరిష్కరిస్తానని, పెండింగ్ పనులు, చెట్లు నాటడంలో బాగాస్వాముడిని అవుతానని తెలుపుతూ, భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధి కొరకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేసారు.

అధ్యాపకుడు కిరణ్ కుమార్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర-వీరబల్లి: వీరబల్లి మండలం వంగిమళ్ళ పంచాయతీ కావలిగడ్డలో ఉండే బొంగా నీ కిరణ్ కుమార్ కు డాక్టరేట్ సాధించారు కిరణ్ కుమార్ రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం అధ్యాపకుడిగా పనిచేస్తున్న కిరణ్ కుమార్ కు ఎస్ వి యు డాక్టర్ డాక్టరేట్ ప్రధానం చేసింది కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి మరియు తల్లిదండ్రులు తెలిపారు కిరణ్ కుమార్ ప్రొఫెసర్ దేవ ప్రసాద్ రాజు ఆప్టికల్ అండ్ లుమినిసిన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ నియోడియం ఈటర్ రీబియ ఎం ని యోడియం. ఆక్సి ఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ ఫోటో నిక్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధార్థ గ్రంధాన్ని సమర్పించినట్లు తెలిపారు డాక్టరేట్ పొందడం ఎంతో అభినందనీయమని ప్రిన్సిపల్ తల్లిదండ్రులకు తెలిపారు.

రోడ్డు తాత్కాలిక మరమ్మతు

విశాలాంధ్ర-సుండుపల్లె: మండలం పరిధిలోని జి.రెడ్డి వారిపల్లి పంచాయతీలోని గంగన్నగారిపల్లె రోడ్డు భారీ వర్షాలకు కోతకు గురై గుంతలమయం కాగా వాహన దారులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అనేకమార్లు అధికారులకు చెప్పిన ఫలితం లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలే స్వచ్ఛందంగా గుంతలకు కుడిచేందుకు గ్రావెల్ మట్టిని తోలి చదును చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని గ్రామప్రజలుకోరుకుంటున్నారు.

బహిరంగ సభా వేదిక స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈ నెల 10న బుధవారం అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ - సూపర్ హిట్ బహిరంగ సభలో పాల్గొంటున్న సందర్భంగా బహిరంగ సభా వేదిక ప్రాంగణాన్ని రైల్వేకోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో, స్థానిక కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు.

చీనీ రైతులకు సమస్య లేకుండా చూడాలి: బిటెక్ రవి

విశాలాంధ్ర-పులివెందుల: చీనీ రైతులకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి అధికారులకు తెలియజేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మార్కెట్ యార్డుకు ఎంట్రీ గేటు కావాలని వ్యాపారులు కోరారని, ఇంటర్ గేటు, ఆర్చ్‌ను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. మార్కెట్ యార్డులోని వ్యాపారస్తులతో, హార్టికల్చర్ అధికారులతో మార్కెట్ యార్డ్ అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయి రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని వివరించామన్నారు. ఆయన వెంట పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్గా ఎన్నికైన గడ్డం అమర్నాథ్ యాదవ్, సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి రామసూరా రెడ్డి సింహాద్రిపురం మాజీ జడ్పిటిసి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డిలు ఉన్నారు.